SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

**ఫోన్ నెం : 99483 13985/ 89789 60131**

సంపుటి : 18 సంచిక : 229 | ఎడిటర్ : విక్రం కుమార్ | సోమవారం 28 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5



ప్రతి భారతీయుడి రక్తం

## మరుగుతోంది

- 'పహల్గాం' బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుంది
- దాడి చేసినోళ్లను, కుట్రదారులను అత్యంత కఠినంగా శిక్షిస్తాం
- ప్రధాని మోదీ హామీ
- ఉగ్రవాదంపై పోరులో దేశ ఐక్యతే అతిపెద్ద బలమని వ్యాఖ్య
- కశ్మీర్ అభివృద్ధిని ఓర్వలేకే దాడి చేశారంటూ మండిపాటు

2లో




# తెలంగాణకు కాంగ్రెసే విలన్

- గోల్‌మాల్ చేయడంలో.. అబద్ధాల్లో దాన్ని మించింది లేదు
- కమీషన్లు తీసుకోవడం.. సంచులు మోయడమే ఆ పార్టీ పని
- 420 హామీల అమలులో వైఫల్యం
- ప్రభుత్వాన్ని మేం పడగొట్టం.. ప్రజలే వారి వీపులు సాపు చేస్తారు
- పోలీసులూ.. వచ్చేది మా ప్రభుత్వమే.. తప్పుడు కేసులు వద్దు..
- నేను బయటికొస్తా.. పోరాడతా
- 11 ఏళ్లలో 11 రూపాయలు కూడా ఇవ్వని భాజపా
- ఆపరేషన్ కగార్‌ను కేంద్రం నిలిపివేయాలి
- భారాస రజతోత్సవ సభలో కేసీఆర్

2లో

## 53% మంది అనర్హులే..!

- ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుల్లో 41.15 లక్షల మందికి అర్హత లేదు..
- 36.03 లక్షల మంది మాత్రమే అర్హులు



2లో



2లో

## అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

- మీరేం చేశారో.. మేమేం చేస్తున్నామో ప్రతి అంశంపై మాట్లాడదాం
- కాళేశ్వరం ఈఎన్‌సీ అవినీతే రూ.200 కోట్లు.. కేసీఆర్ కుటుంబం ఎంత సంపాదించిందో?
- తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్‌లా కనిపిస్తోందా?
- కేసీఆర్‌పై మంత్రులు పొంగులేటి, సీతక్క, జూపల్లి, పొన్నం ధ్వజం

## పోరాటానికి మేం సై!



- భారత నౌకాదళం స్పష్టీకరణ
- విజయవంతంగా నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలు

2లో

# ఆంధ్రులు గర్వించేలా అమరావతి

- నిన్నటి విధ్వంసం నుంచి.. రేపటి వికాసం వైపు ప్రయాణం
- కుట్రలతో మన స్వప్నాన్ని దెబ్బతీయలేరని చెప్పేందుకే..
- రాజధానిని దేశమంతా గుర్తించేలా.. మోదీ చేతుల మీదుగా పనుల పునః ప్రారంభం
- ప్రధాని సభ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు


**సమయం న్యూస్, అమరావతి:** అమరావతి: నిన్నటి విధ్వంసం నుంచి..రేపటి వికాసం వైపు అమరావతి ప్రయాణం మొదలవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు పునః ప్రారంభమయ్యే రోజు..రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు తరువాయి 2లో



## అంతర్గత మార్కులు లేవు.. సిలబస్ మార్పూ లేదు

- ఇంటర్ బోర్డు ప్రతిపాదనలకు విద్యాశాఖ బ్రేక్

2లో



# తెలంగాణకు కాంగ్రెసే విలన్



వరంగల్: తెలంగాణకు ఆనాడైనా, ఈనాడైనా, ఏనాడైనా నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని భారత రాష్ట్ర సమితి (భారాస) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణను 1956లో బలవంతంగా ఆంధ్రాతో కలిపింది, 1969 ఉద్యమ సమయంలో తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చిందీ కాంగ్రెస్సేనని విమర్శించారు. గోల్‌మాల్ చేయడంలో అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ నాయకుల్ని మించిన వారు లేరని దుయ్యబట్టారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే అది నిండా మోసం చేసిందని విమర్శించారు. భారాస రజతోత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బహిరంగసభలో కేసీఆర్ ప్రసంగించారు. పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన వారికి సంతాపసూచకంగా..సభ ఆరంభంలో ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు. తాము అధికారంలో ఉన్న పదేళ్లలో తెలంగాణను ధగధగలాడించామని.. అందరూ ఆశ్చర్యపోయేలా రాష్ట్రాన్ని నిర్మించుకున్నామని, ఇప్పుడు కాంగ్రెస్ వైఫల్యాల వల్ల 2014 కంటే ముందురోజులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై తాను కూడా ఊరుకోనని.. పోరాటాలకు బయల్దేరతానని తెలిపారు. భాజపా వైఖరి అంతా భభ్రాజమానం.. భజగోవిందం, శుష్కప్రియాలు, శూన్యహస్తాలుగా ఉందని, కేంద్రంలో ఉన్న ఆ పార్టీ తెలంగాణకు 11 ఏళ్లలో 11 రూపాయలు కూడా ఇవ్వలేదని, రాష్ట్రంపై మోదీ ఇంకా విషం చిమ్ముతూనే ఉన్నారని ఆరోపించారు.

**జననీ జన్మభూమిశ్చ స్ఫూర్తితో...**

''రామరావణ యుద్ధం పూర్తయ్యాక.. 'లంక చాలా సువర్ణమయంగా ఉంది.. ఇక మనం అయోధ్యకు వెళ్లడమెందుకు? ఇక్కడి నుంచే పరిపాలన చేద్దాం' అని లక్ష్మణుడు, ఇతర యోధులు అంటే.. శ్రీరామచంద్రుడు ఒప్పుకోలేదు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని హితవు పలికారు. కన్నతల్లిని, జన్మభూమిని మించిన స్వర్గం ఏదీ ఉండదని దాని అర్థం. మనకు ఆయన సూక్తులే స్ఫూర్తి. ఒకనాడు అత్యంత గందరగోళ పరిస్థితుల్లో.. ఆత్మహత్యలకు, వలసలకు నిలయంగా, వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న తెలంగాణను ఎట్టి పరిస్థితుల్లోనూ విముక్తి చేయాలని సంకల్పించాం. స్వరాష్ట్రం సాధించాలని, జనని, జన్మభూమిని మించింది లేదని చెప్పి నేను ఒక్కడిగా బయల్దేరి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టా.

**ఆది నుంచీ కాంగ్రెస్ దగా..**

తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రం పేరుతో ఉన్ననాడు.. బలవంతంగా ఆంధ్రాతో కలిపిందే జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రత్యేక రాష్ట్రం కోసం 1969లో ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చి చంపింది ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. 2001 నుంచి మరోసారి మనం ఉద్యమాన్ని ప్రారంభించి, విజృంభిస్తే.. మన బలాన్ని, ఊపును చూసి.. అదే కాంగ్రెస్ నంగనాచిలా వచ్చి.. పొత్తు పెట్టుకొని తెలంగాణ ఇస్తామని నమ్మబలికిన సంగతి మీకు తెలుసు. రాష్ట్రం ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తూ.. 14 సంవత్సరాలు ఏడిపించారు. వాళ్ల ఎత్తుగడలు, మోసాలకు దీటుగా నేను.. జయశంకర్ సార్ వ్యూహాలు రచిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాం. జాతీయస్థాయిలో విపక్షాలన్నిటినీ కూడగట్టాం. చివరకు పార్లమెంటులో అవన్నీ కలిసి మన తరఫున కాంగ్రెస్ గొంతు పట్టుకుంటే.. అప్పుడు ఆ పార్టీ దిగి వచ్చి తెలంగాణ కోసం ప్రకటన చేసిన విషయం మీకు తెలుసు. తర్వాత మరోసారి మడమ తిప్పి, ప్రకటన వెనక్కి తీసుకొన్నదీ మనకు తెలుసు. తర్వాత సకలజనుల సమ్మె, సాగరహారాలు, వంటావార్పులు.. ఇలా అనేక రూపాల్లో విజృంభించి భీకరమైన పోరాటం చేశాం. మూడేళ్ల తర్వాత రాజకీయ అవసరం ఏర్పడి.. తెలంగాణ ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు. వారికి ఇష్టం లేకపోయినా తెలంగాణ సృష్టించిన సుడిగాలులను తట్టుకోలేకనే రాష్ట్రం ఇచ్చిన విషయం మీకు తెలుసు. ఉద్యమ సమయంలో ఆనాటి కాంగ్రెస్, తెదేపాల్లో ఉన్న నాయకులు పదవుల కోసం పెదవులు మూసుకున్నారు. ఏనాడూ గొంతెత్తి కొట్లాడలేదు. గులాబీ జెండా ఎగిరేవరకు కనీసం తెలంగాణ సోయిని కూడా ప్రదర్శించలేకపోయారు. స్వరాష్ట్రం కోసం అవసరమైన ప్రతి సందర్భంలోనూ పదవులు త్యాగం చేసినవారు భారాస బిడ్డలు మాత్రమేనని గర్వంగా చెబుతున్నా. కానీ, పదవుల కోసం తెలంగాణను ఆగం చేసినవారు ఆనాటి కాంగ్రెస్ నాయకులు. హైదరాబాద్ నడిబొడ్డున ఉండే మన శాసనసభలో ఒక దశలో తెలంగాణ పదాన్నే నిషేధించారు నాటి పాలకులు. తెలంగాణ అని అనవద్దంటూ స్పీకర్ ద్వారా రూలింగ్ ఇప్పించారు.

*** అధికారాన్ని బాధ్యతగా తీసుకున్నాం**

ప్రత్యేక తెలంగాణలో ప్రజలు మనకు తొలి విడతలోనే పట్టం కట్టారు. అదేదో అధికారం అనుభవించేందుకు తీసుకోలేదు. బాధ్యతగా తీసుకున్నాం. రాష్ట్రాన్ని మన చేతుల్లో పెడితే ఎక్కడో ఉన్న తెలంగాణను ఎక్కడికో తీసుకెళ్లాం. పదేళ్ల భారాస పాలనలో తెలంగాణ ఏ స్థాయికి ఎదిగింది.. ఎన్ని రంగాల్లో ఎన్ని అవార్డులు వచ్చాయి.. ఎన్ని అద్భుతమైన పనులు చేసి చూపించాం.. అన్నీ గుర్తుచేసుకోవాలి. తెలంగాణ అంటే ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతం.. ఎగతాళికి గురైన ప్రాంతం. కానీ.. రాష్ట్రం ఏర్పడ్డాక వాటన్నిటినీ పటాపంచలు చేశాం. అన్ని రంగాలను పరుగు పెట్టించాం. రూ.90 వేలున్న తలసరి ఆదాయాన్ని రూ.3.50 లక్షలకు పెంచుకున్నాం. జీఎస్‌డీపీని దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లాం. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకున్నాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టులను ఆగమేఘాలపై పూర్తి చేయించాం. పాలమూరు జిల్లాలోనే 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. 3.5 లక్షల టన్నుల వడ్లు పండించే స్థాయికి రాష్ట్రంలో సాగునీటి సదుపాయాలను అభివృద్ధి చేశాం. పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి వరంగల్ గడ్డకు నీరు తెచ్చుకున్నాం. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకున్నాం. వాగులు, వంకలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల్లో పూడిక తొలగించాం. మొత్తంగా అద్భుతమైన తెలంగాణను తీర్చిదిద్దుకున్నాం.

**ప్రజలు అడగకముందే..**

రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, కంటి వెలుగు వంటి కార్యక్రమాలు అమలు చేయాలని నన్నెవరూ అడగలేదు. మన రాష్ట్రం.. మన ప్రజలని.. వారిని బాగు చేసుకోవాలని ఆ పథకాలు అమలు చేశాం. చెరువుల్లో చేపలు పెంచాలని నన్ను ఎవరు అడిగారు? మత్స్యకారులకు పని దొరకాలని, వారిని ప్రోత్సహించాలని చెరువుల్లో చేపలు పెంచాం. లక్షల గొర్రెలను పంపిణీ చేయాలని ఎవరూ అడగలేదు.. పెంపకందారులు బాగుండాలని ఆ పథకాన్ని అమలు చేశాం. పారిశ్రామికరంగంపై దృష్టి పెట్టాం. పెట్టుబడులను ఆకర్షించాం. సుమారు 2025 లక్షల మంది యువతకు ఉద్యోగాలిప్పించే ప్రయత్నం చేశాం. రూ. 40 వేల కోట్లున్న ఐటీ ఎగుమతులను రూ.2.50 లక్షల కోట్లకు పెంచగలిగాం. ఐటీ రంగంలో ఏడు లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయి. వెయ్యికిపైగా గురుకులాలు తీసుకువచ్చి.. పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాం. మెడికల్ కాలేజీలను 3 నుంచి 33కి పెంచాం. భారాస హయాంలో మత కల్లోలం లేదు. కర్ఫ్యూ లేదు. శాంతిభద్రతల్ని చక్కగా కాపాడి.. అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకున్నాం. ఇవన్నీ నా డైలాగులు కాదు, స్టోరీలు కాదు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు వేదికగా అనేక సందర్భాల్లో చెప్పిన విషయాలు.. ఆర్‌బీఐ, కాగ్ వంటి సంస్థలు వెల్లడించిన అధికారిక లెక్కలేనని మీకు మనవి చేస్తున్నాం.

*** సిగ్గు లేకుండా బాండ్ పేపర్లు రాసిచ్చారు**

మన ప్రభుత్వంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు పెట్టి తడిసినా, రంగు పోయినా, మొలక వచ్చినా.. రైతులు, మన బిడ్డలు కాబట్టి ప్రభుత్వానికి రూ. 5 వేల కోట్ల నష్టం వచ్చినా కొన్నాం.. కాంగ్రెసోళ్లేమో ప్రజల్ని బోల్తా కొట్టించేందుకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ఇచ్చిన కల్యాణలక్ష్మిని కాదని.. దానికి తులం బంగారం కలిపి ఇస్తామన్నారు. ఇది ఎవరికైనా వచ్చిందా? ఇలా 420 హామీలపై పెద్ద పెద్ద పుస్తకాలు పంచారు. సిగ్గు లేకుండా బాండ్ పేపర్లు రాసిచ్చారు. ఇవన్నీ ఎలా ఇస్తారని అడిగితే.. చేసి చూపిస్తామన్నారు. మరి అవన్నీ ఇచ్చారా? అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని చేయలేదు. ఈలోపు ఎంపీ ఎన్నికలొచ్చాయి. నాకు కాలు విరిగినా, జనంలోకి బయలుదేరాను. దీంతో తెలంగాణలో ఎందరు దేవుళ్లుంటే అందరి మీదా ఒట్లు పెట్టారు. ఎన్నో మాటలు చెప్పి మోసం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి.. వాళ్లు జుట్లు పట్టుకుని కొట్టుకునే స్థాయికి తెచ్చారు. ఈ ఉచిత బస్సు మాకు అవసరం లేదని ఆడబిడ్డలు అంటున్నారు.

*** జేసీబీలతో పేదల ఇళ్లు కూలగొట్టిస్తున్నారు**

మేం జేసీబీలు పెట్టి చెరువుల్లో పూడిక తీస్తే.. కాంగ్రెస్ పార్టీ హైడ్రా అంటూ పేదల ఇళ్లు కూలగొట్టిస్తోంది. కేసీఆర్ బాగా ఇచ్చిన కరెంటు.. కాంగ్రెస్ ఎందుకివ్వలేకపోతోంది? మంచినీళ్లు ఎందుకు బంద్ అయ్యాయి? భూముల ధరలు ఎందుకు పడిపోయాయి? ప్రభుత్వ ఆదాయం కోసం అత్యవసరమైతే ప్రజలకు ఉపయోగం లేని భూములు అమ్మవచ్చు. కానీ ఏది అమ్మాలో.. ఏది అమ్మకూడదో తెలివి ఉండాలి. కాంగ్రెసోళ్లు ఇప్పుడు హెచ్‌సీయూ భూములను అమ్ముతున్నారు. రేపు ఓయూలో విలువైన భూములున్నాయని వాటిని అమ్మేస్తారా?

## అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

హైదరాబాద్: భారాస అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు ఏ ఒక్క విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మంత్రులు విమర్శించారు. అధికారంపై కేసీఆర్ పగటికలలు కంటున్నారని.. ఈ మూడున్నరేళ్లతోపాటు మరో పదేళ్లూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కడుపులో అంతా విషం పెట్టుకుని ఎల్కతుర్తి బహిరంగసభలో కాంగ్రెస్‌పై అసత్యప్రచారం చేశారని మండిపడ్డారు. భారాస రజతోత్సవ సభ అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ని విలన్‌లా సంబోధించిన భారాస అధినేతపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియాగాంధీ ఇవ్వకపోతే తెలంగాణ వచ్చేదా? అని వారు నిలదీశారు. తెలంగాణ సంపదను కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల పేరుతో కొల్లగొట్టారని ఆరోపించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.

*** మీ కుటుంబ సభ్యులకు రూ.వేల కోట్ల ఆస్తులెలా వచ్చాయి?: పొంగులేటి**

'కడుపులో అంత విషం పెట్టుకుని, ఉక్రోషంతో మీ పార్టీ సభలో మాట్లాడారు. భారాస పదేళ్ల పాలనలో చేసిన ఘనకార్యాలు, 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అసెంబ్లీలో చర్చిద్దామా? ప్రతి అంశంపై మాట్లాడుదాం. ఆరు రోజులైనా, ఎనిమిది రోజులైనా చర్చిద్దాం. తేదీ ఎప్పుడో కేసీఆర్ చెప్పాలి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాలు విసిరారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. కేంద్రం నివేదిక ఇచ్చింది. కాళేశ్వరం అవినీతిపై సభలో ఎందుకు మాట్లాడలేదు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? నాడు సోనియాగాంధీని దేవత అని పొగిడారు. మీ కుటుంబం అంతా సోనియాకు సాష్టాంగ నమస్కారం చేసిన విషయాన్ని మరిచిపోయారా? ప్రజలు రెండుసార్లు అధికారం ఇస్తే తెలంగాణ సంపదను కొల్లగొట్టారు. అందుకే ప్రజలు మీ పార్టీకి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో గుణపాఠం చెప్పారు. మీరు ప్రతిపక్షనేతగా అసెంబ్లీలో ప్రభుత్వానికి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. ఐదారు పర్యాయాలు అసెంబ్లీ సమావేశాలు జరిగితే మీరు ప్రేక్షకుడి మాదిరి రెండురోజులే వచ్చి వెళ్లారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో.. ఇందిరమ్మ ప్రభుత్వంలో మంత్రులంతా సామాన్యులకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతుంటే తట్టుకోలేకపోతున్నారు. మీరు సీఎంగా ఉన్నప్పుడే కాంట్రాక్టర్లకు రూ.8082 వేల కోట్ల బకాయిలున్నాయి. సర్పంచులకు బిల్లులు చెల్లించకుండా మోసం చేసిందే భారాస ప్రభుత్వం. ఉద్యమ పార్టీ నుంచి మొదలై భారాసగా మారిన మీ పార్టీకి రూ.1500 కోట్లకుపైగా డబ్బు ఎలా వచ్చింది? ఏం వ్యాపారం చేశారని మీ కుటుంబ సభ్యులకు రూ.వేల కోట్ల ఆస్తులు వచ్చాయి? అధికారంపై మీవి పగటి కలలే. ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ ఖమ్మం సభకు వచ్చినప్పుడు ఆర్టీసీ బస్సులే కాదు.. ఆటోలు, ద్విచక్రవాహనాలను రాకుండా చేశారు. భారాస సభకు మీరు ఎన్ని బస్సులు అడిగితే అన్నింటికి రేవంత్ ప్రభుత్వం అనుమతించింది. ప్రజాస్వామ్యం అంటే ఇది. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తా అన్నారు. చేయలేదు. మీరు ఎలాగు అసెంబ్లీకి రావడం లేదు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పదవి దళితుడికి ఇవ్వొచ్చు కదా? కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాలని మీరెంత తాపత్రయపడ్డా ఫలితం ఉండదు. మీ పగటి కలల్ని తెలంగాణ ప్రజలు నెరవేరనీయరు.'' అని పొంగులేటి అన్నారు.

**పోలీసు వ్యవస్థను దారుణంగా వాడుకున్నారు: సీతక్క**

''అధికారం పోయిందన్న అక్కసును కేసీఆర్ వెళ్లగక్కారు. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లో 59వేల ఉద్యోగాలు ఇస్తే.. భారాస అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల్ని వాడుకుని అణచివేస్తే ఆత్మహత్యలు చేసుకున్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై కచ్చితంగా కేసులు పెడతాం. అధికారంలో ఉన్నప్పుడు ఇంటింటికి తాగునీటి పేరిట రూ.వేల కోట్లు తినేశారు.. కానీ నీళ్లు ఇవ్వలేదు. భారాస హయాంలో 5వేల మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులను బెదిరిస్తున్నారు. కేసీఆర్ అంత దారుణంగా పోలీసు వ్యవస్థను ఎవరూ వాడుకోలేదు. అధికారం ఉంటే.. అసెంబ్లీకి వస్తారు లేకుంటే రాని మీరు నాయకులు కానేకారు. నియంతలు అధికారం పోయాక ప్రజల్లోకి వచ్చి మొసలికన్నీరు కారుస్తారు.. కేసీఆర్ ఇందుకు నిదర్శనం.

**ఇంకా గర్వం పోలేదు..: జూపల్లి కృష్ణారావు**

''కేసీఆర్‌కు అధికారం పోయినా గర్వం, నియంతృత్వ ధోరణి ఇంకా పోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్, డిజైనర్, కాంట్రాక్టరు ఆయనే. నీటిపారుదలశాఖ కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ నివాసంలో సోదాలు చేస్తేనే రూ.200కోట్ల ఆస్తుల లెక్కలు దొరికాయని అంటున్నారు. కేసీఆర్ కుటుంబంలో ఇంట్లో ఎంత ఉంటాయో? ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదు. తెలంగాణ ఇస్తే ఏపీలో నష్టం జరుగుతుందని తెలిసీ, రాజకీయకోణంలో ఆలోచన చేయకుండా సోనియాగాంధీ పెద్దమనసు చేసుకుని రాష్ట్రం ఇచ్చారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే రూ.64వేల కోట్ల అప్పు నుంచి రూ.8లక్షల కోట్ల అప్పుచేశారు. 20 ఏళ్ల క్రితం ప్రైవేటు వ్యక్తికి 400ఎకరాల భూమి అప్పగిస్తే.. ఆ భూమి స్వాధీనం చేసుకునేందుకు పదేళ్లు కేసీఆర్ ఎందుకు ప్రయత్నించలేదు?

**సోనియా ఇవ్వకుంటే తెలంగాణ వచ్చేదా: పొన్నం**

సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని ఆనాడు చెప్పిన కేసీఆర్ ఇప్పుడు పార్టీ సభలో అవకాశవాదిగా మాట్లాడారు. కాంగ్రెస్ విలన్ అన్న మాటలను ఆయన ఉపసంహరించుకోవాలి. సోనియాగాంధీ ఇవ్వకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా? కేసీఆర్ మూడు చెరువులు నీళ్లు తాగినా వంద మంది కేసీఆర్‌లు వచ్చినా కాంగ్రెస్ ఇవ్వకుంటే రాష్ట్రం ఏర్పడేది కాదు.

## పోరాటానికి మేం సై!

దిల్లీ: పాకిస్థాన్‌తో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత నౌకాదళం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలను దిగ్విజయంగా నిర్వహించింది. తద్వారా దీర్ఘశ్రేణి లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించేలా పోరాట సామర్థ్యాన్ని చాటింది. ''పోరాటానికి మేం సిద్ధం. సముద్ర జలాల్లో ఎప్పుడైనా.. ఎక్కడైనా దేశ ప్రయోజనాలను కాపాడేందుకు సన్నద్ధంగా ఉన్నాం'' అని భారత నౌకాదళం ఒక ప్రకటనలో పేర్కొంది. తాజా పరీక్షలకు సంబంధించిన వీడియోలనూ విడుదల చేసింది. అయితే వీటిని ఎప్పుడు నిర్వహించారన్నది వెల్లడించలేదు. ఇటీవల ఐఎన్‌ఎస్ సూరత్ యుద్ధనౌక నుంచి ఎంఆర్‌శామ్ క్షిపణిని భారత నౌకాదళం విజయవంతంగా పరీక్షించిన సంగతి తెలిసిందే.

## ఆంధ్రులు గర్వించేలా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందన్నారు. మే 2న రాజధానిలో ప్రధాని మోదీ పాల్గొనే సభకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉండవల్లిలోని నివాసంలో ఆదివారం సాయంత్రం సమీక్షించారు. 'ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన రాజధానిని వైకాపా ప్రభుత్వం విధ్వంసం చేసింది. నేడు మళ్లీ అదే ప్రధాని చేతుల మీదుగా పనులు తిరిగి ప్రారంభించి.. ఒక అద్భుత రాజధానిని నిర్మించి, విధ్వంసకారులకు గట్టి సమాధానం చెబుతున్నాం' అని స్పష్టం చేశారు. 'గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు దాడులు చేసింది. అయితే అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజల అభిలాషకు అనుగుణంగా ప్రారంభమైన అమరావతి.. వాటన్నింటినీ తట్టుకుని నిలబడింది. గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా ఎదురైన సవాళ్లను.. కూటమి అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే పరిష్కరించి.. నిలిచిపోయిన పనుల్ని పట్టాలెక్కిస్తున్నాం' అని సీఎం వివరించారు.

## 53% మంది అనర్హులే..!

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కోసం 'ప్రజాపాలన'లో వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇళ్ల కోసం మొత్తం 77.18 లక్షల మంది దరఖాస్తు చేయగా.. వీరిలో 36.03 లక్షల (46.7 శాతం) మంది అర్హులని గుర్తించారు. మిగతా 41.15 లక్షల (53.3 శాతం) మందిని అనర్హులుగా తేల్చారు. అనర్హులంతా దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారేనని నిర్ధారించారు. అర్హులు, అనర్హుల వివరాలను గృహ నిర్మాణశాఖ ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 జాబితాలుగా సిద్ధం చేసి పెట్టుకుంది. దీని ప్రకారమే ప్రతి ఆర్థిక సంవత్సరం నియోజకవర్గానికి 3,500 చొప్పున.. రాష్ట్రంలో ఏటా గరిష్ఠంగా మొత్తం 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఇళ్ల దరఖాస్తుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. యాప్‌లో పొందుపరిచిన మార్గదర్శకాల మేరకు అన్ని కోణాల్లో చేసిన సర్వేతో పాటు.. ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా దరఖాస్తుదారులను ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3గా విభజించారు. ఎల్ 1లో 23.05 లక్షలు, ఎల్ 2లో 21.44 లక్షలు, ఎల్ 3లో 32.69 లక్షల దరఖాస్తుదారులు ఉన్నట్లు తేల్చారు. ఎల్ 1 జాబితాలో సొంత స్థలాలు ఉండి ఇళ్లు లేని వారిని చేర్చారు. సొంత స్థలంలో పూరిళ్లు, మట్టిమిద్దెలు, రేకుల ఇళ్లు ఉన్నవారిని కూడా ఇందులో చేర్చారు. ఎల్ 2 జాబితాలో స్థలాలు, ఇళ్లు లేని వారిని చేర్చారు. ఎల్ 3 జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, సొంత ఇళ్లు, కార్లున్నవారు, దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారు, ఆదాయపుపన్ను చెల్లిస్తున్న వారిని చేర్చారు. వీటి ఆధారంగా గత ఫిబ్రవరిలోనే జాబితాను తయారు చేశారు.

## ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోంది

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆ ఘాతుకానికి తెగబడిన ముష్కరులు, వారి వెనక ఉన్న కుట్రదారులను అత్యంత కఠినంగా శిక్షిస్తామని ఉద్ఘాటించారు. పహల్గాం దాడికి సంబంధించిన ఫొటోలు చూస్తుంటే ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోందని పేర్కొన్నారు. 'మన్ కీ బాత్'లో ఆదివారం ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఉగ్రవాదంపై పోరాటంలో మన దేశ ఐక్యత, 140 కోట్ల మంది పౌరుల సంఘీభావమే అతిపెద్ద బలమని చెప్పారు. ''కశ్మీర్ లోయలో శాంతి నెలకొంటుండటం, అక్కడి పాఠశాలలు/కళాశాలల్లో చైతన్యం వెల్లివిరుస్తుండటం చూసి.. ఉగ్రవాద పోషకులు (పాకిస్థాన్‌ను ఉద్దేశించి) ఓర్వలేకపోయారు. కశ్మీర్‌లో మునుపెన్నడూ లేనంత వేగంగా నిర్మాణ పనులు జరుగుతుండటం, పర్యాటకులు రికార్డు స్థాయిలో పెరుగుతుండటం, ప్రజాస్వామ్యం బలోపేతమవుతుండటం, ప్రజల ఆదాయం పెరుగుతుండటం, యువతకు కొత్త అవకాశాలు వస్తుండటం చూసి వారు సహించలేకపోయారు. పహల్గాం దాడి.. వారి నైరాశ్యం, పిరికితనానికి అద్దం పట్టింది'' అని ప్రధాని పేర్కొన్నారు.

**మనకు యావత్ ప్రపంచ మద్దతుంది**

కశ్మీర్ అభివృద్ధి చెందుతుండటం మన దేశ శత్రువులకు, జమ్మూకశ్మీర్ విరోధులకు నచ్చలేదని మోదీ అన్నారు. లోయ మళ్లీ నాశనమవ్వాలని ఉగ్రవాదులు, ఉగ్రచర్యల సూత్రధారులు కోరుకుంటున్నారని.. అందుకే ఇంత పెద్ద కుట్రకు పాల్పడ్డారని పేర్కొన్నారు. పహల్గాం దాడి తనను తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. ఈ ఉగ్రదాడి బాధితుల కుటుంబాల పట్ల.. భాష, రాష్ట్రం అనే భేదాల్లేకుండా భారతీయులంతా సానుభూతి చూపుతున్నారని చెప్పారు. ''నేను మరొక్కసారి హామీ ఇస్తున్నా. బాధిత కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుంది'' అని పేర్కొన్నారు.

## అంతర్గత మార్కులు లేవు... సిలబస్ మార్పూ లేదు

హైదరాబాద్: ఇంటర్‌లో సిలబస్ మార్చాలని...అంతర్గత మార్కులు ప్రవేశపెట్టాలని ఎన్నో నెలలుగా ఇంటర్ బోర్డు చేసిన కసరత్తుకు బ్రేక్ పడింది. బోర్డు ప్రతిపాదనలకు విద్యాశాఖ ఆమోదం లభించలేదు. ఆర్ట్స్ గ్రూపు సబ్జెక్టులతోపాటు భాషా సబ్జెక్టుల్లో అంతర్గత మార్కులు ప్రవేశపెట్టాలని, వంద మార్కుల్లో ప్రాజెక్టులు/ఎసైన్‌మెంట్ తదితర వాటి పేరిట 20 ఇంటర్నల్ మార్కులు కేటాయించాలని, 80 మార్కులకు రాత పరీక్ష జరపాలన్నది బోర్డు ప్రతిపాదన. దానికితోడు సైన్స్ సబ్జెక్టుల్లో ఎన్‌సీఈఆర్‌టీకి అనుగుణంగా సిలబస్ తగ్గించడంతోపాటు చిన్న చిన్న మార్పులు చేయాలని భావించింది. సిలబస్ మార్పునకు అంగీకరించకపోవడంతో బోర్డు వర్గాలతోపాటు అధ్యాపకులు షాక్‌కు గురయ్యారు.

**గత నవంబరు నుంచి కసరత్తు :** వాస్తవానికి సిలబస్ మార్పునకు సంబంధించి గత ఏడాది నవంబరు నుంచి కసరత్తు జరుగుతోంది. అధ్యాపకులు, వర్సిటీల ఆచార్యులను ఆహ్వానించి సిలబస్ రివిజన్‌పై పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో పోల్చుకుంటే ఇంటర్‌లో అధికంగా ఉందని, విద్యార్థులకు భారంగా మారిందన్నది సబ్జెక్టు నిపుణుల అభిప్రాయం. రసాయనశాస్త్రంలో ఆరు అధ్యాయాలను ఎన్‌సీఈఆర్‌టీ తొలగించినందున ఇక్కడా తీసివేయాలన్నది ఇంటర్‌బోర్డు భావన. అలాగే గణితం, భౌతికశాస్త్రంలో 1520 శాతం సిలబస్ భారం తగ్గుతుందని బోర్డు వర్గాలు చెబుతూ వచ్చాయి. భౌతికశాస్త్రంలో సిలబస్ తగ్గుతున్నందున ఆ మేరకు కృత్రిమ మేధ, రోబోటిక్స్ లాంటి అంశాలపై అవగాహన కల్పించేలా సిలబస్‌లో చేర్చాలనుకున్నారు.

# గులాబీ జెండా ఎగిరింది.... కేసీఆర్ సైన్యం కదిలింది



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 28 సమయం న్యూస్ :** ఈ రోజు 132 జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామం ప్రధాన చౌరస్తాలో "ఛలో వరంగల్" రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని మాదిగ చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బిఆర్ఎస్ పార్టీ జెండాను పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా 2001 సంవత్సరంలో తెలంగాణ జాతిపిత కేసీఆర్ గారి ఆధ్వర్యంలో స్థాపించబడిన బిఆర్ఎస్ పార్టీ ఆ తర్వాత ఎన్నో ఆటుపోట్లు, త్యాగాల నడుమ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చిన మహానేత, మన నాయకులు కేసీఆర్ గారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమం,అభివృద్ధికై బిఆర్ఎస్ పార్టీయే రక్ష అని అన్నారు. అనంతరం చలో వరంగల్ రజతోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానులకై ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, మాదిగ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. బలరాం, సభ్యులు జి.రాజేష్, ఏ.శ్రీనివాస్, కె.గోపాల్, ఏ.శ్రీనివాస్, శ్రీకాంత్, ఏ.యాదగిరి, జి.యాదగిరి, పోహన్న, అంజి, ఉమేష్ యాదవ్, మహా నగర్ ఈస్ట్ ప్రెసిడెంట్ ఎన్.కుమార్, బోలా శంకర్ నగర్ సభ్యులు సి.నారాయణ, నాగరాజు, మధు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్ది మల్లేశం, మురళీ గౌడ్, నరహరి గౌడ్, నాగేష్, లక్ష్మణా చారి, ప్రభాకర్, బిక్షపతి గౌడ్, గోపాల కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, నాయకులు సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## రజతోత్సవ సభకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్ళిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు

మేడ్చల్ మల్కాజిగిరి ఏప్రిల్ 28 సమయం న్యూస్ : చలో వరంగల్ బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మల్కాజిగిరి నియోజకవర్గ అల్వాల్ సర్కిల్, మల్కాజ్గిరి సర్కిల్ డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ జెండాలు ఆవిష్కరించి బస్సులు, కారులను జెండా ఊపి భారీ ర్యాలీనీ ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి. ఈ కార్యక్రమాలలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్, మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బి ఆర్ యస్ నాయకులు జెఎసి వెంకన్న, బద్దం పరశురామ్ రెడ్డి, రాము యాదవ్, జి కే హనుమంత రావు, మురుగేశ్, అమీనుద్దిన్, చిన్న యాదవ్, శివ కుమార్, లడ్డు నరేందర్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఏప్రిల్ 30న మహనీయుల జయంతి కార్యక్రమం విజయవంతం చేయాలి

* **ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల సంఘం నేతలు**

బోధన్ పట్టణం, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో ఏప్రిల్ 30వ తేదీన నిర్వహించనున్న మహనీయుల జయంతి వేడుకలు ఘనంగా జరగాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర నాయకుడు పరిమి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం రోజున బోధన్ తాలూకా రైస్ మిల్ అసోసియేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నెలలో డా. బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిరావ్ పూలే, శ్రీనారాయణగురు వంటి మహనీయులు పుట్టిన రోజులు ఉండటంతో, వీరి జయంతుల్ని ఏకకాలంలో 30వ తేదీన నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఉమ్మడి రాష్ట్రాల్లో బోధన్లోనే ప్రత్యేకంగా జరగడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలాదిగా ప్రజలు పాల్గొంటారని, అందరి సహకారంతో విజయవంతం చేయాలని కోరారు. రాఘవులు రైస్ మిల్ ప్రాంతం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుండి వేకువజాము 6 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని, మహారాష్ట్ర బృందం "ఆమ్నేసామ్నే" కార్యక్రమంతో ప్రత్యేక ఆకర్షణగా పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నీరడి ఈశ్వర్, నీరడి కుమార్, కొంద్ర వెంకటి, సింగడి పాండు, సూర్యకాంత్, దేవేందర్, కారం స్వామి, రాహుల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మండల రైతులకు భూ భారతి అవగాహన సదస్సు

* **జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్డే కృష్ణ పిలుపు**

జిన్నారం, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : మండల రైతులు భూ భారతి అవగాహన సదస్సుకు హాజరుకావాలని జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ పిలుపునిచ్చారు. జిన్నారం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏప్రిల్ 28 (సోమవారం) రోజున మధ్యాహ్నం 2 గంటలకు ఎన్.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ జిన్నారం లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి, జిన్నారం తహసిల్దార్ యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, హాజరవుతారని వారు తెలిపారు. రైతులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని వారు పడుతున్న ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవాలని వారు కోరారు. రైతులు అదిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# వంజరికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

* **ఎస్టీలుగా పునరుద్ధరించాలి**
* **తెలంగాణ వంజరి సంఘం డిమాండ్**

అంబర్ పేట ఏప్రిల్ 27(సమయం న్యూస్): తెలంగాణలో నివసిస్తున్న వంజరి కులస్తుల సామాజిక ఆర్థిక అభివృద్ధి కొరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వంజరి సంఘ సమాలోచన సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈరోజు తార్నాక లోని రాష్ట్ర వంజరి సంఘకార్యాలయంలో జరిగిన వంజరి కులస్తుల సమాలోచన సమావేశం పలు అంశాలపై తీర్మానాలు చేసింది. సభకు అధ్యక్షతన వహించిన తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కాలేరు విశ్వనాథము మాట్లాడుతూ, ఉప్పల్ బాగాయతులో తెలంగాణ వంజరి ఆత్మగౌరవ భవన నిర్మాణం కు ప్రభుత్వము నిధులు కేటాయించకపోవడం బాధాకరమని, వెంటనే ఐదు కోట్ల రూపాయల నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నివసిస్తున్న వంజరి కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా వంజరి కులస్తులు కోల్పోయిన ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని సమావేశం డిమాండ్ చేసింది. మూడు సంవత్సరాల నుండి సంఘంలో జరుగుతున్న వివిధ పరిణామాలపై సమావేశం సమీక్ష చేసింది. కార్యవర్గం పదవీకాలం ముగిసినందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సమావేశం డిమాండ్ చేసింది. సహకార శాఖ ఇందులో వెంటనే జోక్యం చేసుకోవాలని ప్రభుత్వాన్ని సమావేశం కోరింది. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు సాల్వేరు ముత్తయ్య మైసరి మాణిక్ ప్రభు, సలహాదారులు కాలేరు సురేందర్ భానుక ఆంజనేయులు అఖిలభారత వంజరి సంఘం ఉపాధ్యక్షులు సాల్వేరు కృష్ణ తెలంగాణ వంజరి సేవా సంఘం ఉపాధ్యక్షులు ఎదుగని హరినాథ్, రిజర్వేషన్ కమిటీ చైర్మన్ ముజకరి రవీందర్ కార్యదర్శి పోతాను కార్ లక్ష్మీనారాయణ తెలంగాణ వంజరి సంఘం ఉపాధ్యక్షులు ఆముద్ద విజయ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లవంగు ఆంజనేయులు, దాత్రిక కాశీనాథ్,, క్యాదరి నర్సింగరావు దాత్రిక ధర్మరాజు, కాలేరు యుగంధర్, గోపాల్ రమేష్,తారక రాజేందర్ విటల్ నారాయణ విటల్ రవి కాలేరు శ్రీనివాస్ దేనుక అనిల్, ఆముద లక్ష్మణ్, నవతూ రాజేందర్ మైసరి పరమేశ్వర్ దౌరే గంగరాజు ఎదగని శ్రీనివాస్ బిలంకి నరసింహారావు దాత్రిక లింగం ఎదుగని కృష్ణమూర్తి నిసంగి విద్యాసాగర్ నిసంగి సురేందర్, నిసంగి నాగభూషణం మహిళా సంఘ ప్రతినిధులు దాత్రిక సాయి రాజని, ఆరే గీత, తారక మహేశ్వరి, నిజామాబాద్ జిల్లా ప్రతినిధులు మాస్టర్ శంకర్, బూర్గుల వినోద్, ఎదుగని రాజ్ కుమార్, రత్నం సంతోష్, కొండేరి సతీష్, కరిపే అనిల్, విటల్ శరన్ ఎం కే శ్రీనివాస్, దాత్రిక సంతోష్, సాల్వేరు కోటేశ్వరరావు, మరియు వివిధ జిల్లాల నుండి ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






## చలో వరంగల్ బీ ఆర్ ఎస్ సభకు బయలుదేరిన మాధవరం కృష్ణారావు మరియు గులాబీ శ్రేణులు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 28 సమయం న్యూస్ : బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కూకట్పల్లి నియోజకవర్గం నుంచి ప్రతి డివిజన్ నుంచి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, ప్రజలు వేలాదిమందిగా తరలి వెళ్లారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గారు మాట్లాడుతూ ఆనాడు కెసిఆర్ గారు ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారని.. 25 వసంతాల BRS పార్టీ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని అవమానాలకు, కష్టాలకు ఎదురొడ్డి నిలిచి తెలంగాణ రాష్ట్రం సాధనే లక్ష్యంగా.. కెసిఆర్ గారు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని అంతేకాకుండా ముఖ్యమంత్రిగా ఆయన తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్ది ఆనాడు దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిపారని అనడంలో అతిశక్తి లేదని గుర్తు చేశారు.. వ్యవసాయం, పారిశ్రామిక, టెక్నాలజీ శాంతిభద్రతలు ఇలా అన్ని రంగాల్లో కూడా తెలంగాణ రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పాలనలో ఎంతో అభివృద్ధి చేసుకున్నాం.. కానీ నేడు కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న విధానాలతో అన్ని రంగాలు కుంటూ పడ్డాయని.. ఈ విషయాన్ని ప్రజలు గమనించారని తిరిగి మళ్లీ కెసిఆర్ గారికే పట్టం కట్టి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని గుర్తు చేశారు...

# శ్రీనివాస ట్యుటోరియల్ కాలేజ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బోధన్‌లో ఘనంగా నిర్వహణ






బోధన్ పట్టణం, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : బోధన్ పట్టణంలో స్థానికంగా ఉన్న శ్రీనివాస ట్యుటోరియల్ కాలేజీ లో 19911992 సంవత్సరపు పదవ తరగతి విద్యార్థులచే, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరితంగా జరిగింది. కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీ సుబ్బరాజు, ఉపాధ్యాయులైన సాయిలు, దీపక్, ఇందిరా, విజయలక్ష్మి, శోభ ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు తమ విద్యా జీవితం నాటి అనుభవాలను పంచుకుంటూ, గురువుల పట్ల తమ కృతజ్ఞతను వ్యక్తపరిచారు. నాటి మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా సమయం గడిపారు. ఈ సమ్మేళనం విద్యార్థుల మధ్య బంధాలను బలోపేతం చేయడమే కాక, పాఠశాల పట్ల గౌరవాన్ని మరింత పెంపొందించింది. శ్రీనివాస ట్యుటోరియల్ బోధన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బోధన్ విద్యా రంగంలో ఒక ప్రత్యేక సంఘటనగా నిలిచింది.




## గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులకు నిత్యవసర సరుకులు, ఆర్థిక సాయం

* **శివంపేట పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి**

శివంపేట ఏప్రిల్ 27 (సమయం న్యూస్) : శివంపేట్ మండల్ గుండ్లపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులకు అడగగానే తనవంతుగా సహాయం చేసి కార్మికులకు ఒక్కొక్కరికి 2000 లు చొప్పున 4 గురికి 8000 లు కార్మికులకు ఇవ్వడం జరిగింది.మంచి నూనె, పప్పు దినుసులు అందజేసిన ప్రజల ఆపద్బాంధవుడు శివంపేట్ మండల్ పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి అందజేయడం జరిగింది వారికి ఏ ఆపద వచ్చిన నేను చేస్తానని మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు షఫీ ఉద్దీన్, మాజీ సర్పంచ్ తాటి కృష్ణయ్య, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దుర్గా రెడ్డి, తిరుపతి రెడ్డి, రాజు, సీవీర్ యూత్ సభ్యులు పాల్గొనడం జరిగింది

# బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో రుద్రహోమం

గుమ్మడిదళ, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామంలో గల వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం నాడు రుద్రహోమం చేశారు. ఈ రోజున అమావాస్య కారణంగా ఈ హోమాన్ని నిర్వహించినట్టు ఆలయ ఇ ఓ శశిధర్ గుప్తా తెలిపారు. ఈహోమ కార్యక్రమాన్ని ఆలేటి వెంకటరెడ్డి దంపతులు చేయించారు.ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్యకు ఆలయాలం లో రుద్రహోమం జరిపిస్తామని,ఈ విషయాన్ని భక్తులు గమనించి హాజరు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సోమయ్య,అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.



## ఓరుగల్లు బిఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా బయలుదేరిన శివంపేట మండలం నాయకులు కార్యకర్తలు!!

శివంపేట్ ఏప్రిల్ 27 (సమయం న్యూస్) : బిఆర్ఎస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు శివంపేటమండలం నుండి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో బయలుదేరారు. బిఆర్ఎస్ పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షులు రాజారమణ గౌడ్ఆవిష్కరణ చేశారు.అనంతరం మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ వరంగల్ సభకు కార్యకర్తలు స్వచ్ఛందంగా రావడం చాలా సంతోషంగా ఉందని మండల పార్టీ అధ్యక్షులు రమణా గౌడ్ అన్నారు. ప్రజలతో పాటు కేసీఆర్ సభ కోసం ఆయన మాటలు వినడానికి ఆసక్తిగా రాష్ట్ర ప్రజలు





ఎదురు చూస్తున్నారని అన్నారు . అనంతరం నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జెండా ఊపి బస్సును ప్రారంభించారు . ఈ బస్సులో నాయకులు కార్యకర్తలుబీఆర్ఎస్ సభకు బయలుదేరారు ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా, తాజా మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్, శివంపేట మండలంలోని వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## చలో వరంగల్ భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభకు భారీగా తరలి వెళ్ళిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు

కంగ్టి,ఏప్రిల్ 27(సమయం న్యూస్) : కంగ్టి మండలంలోని సుక్కల్ తీర్థం గ్రామంలో చలో వరంగల్ బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి సభకు వెళ్లే వాహనాల ముందు జెండా ఊపి భారీ ర్యాలీనీ ప్రారంభించిన మాజీ సర్పంచ్ రమేష్ రావ్(సుక్కల్ తీర్థ్) మరియు నాయకులు,యువకులు,కార్యకర్తలు,అభిమానులు. దేశం మొత్తం కేసీఆర్ బహిరంగ సభ వైపు చూస్తుంది. దేశ రాజకీయాల్లో రజతోత్సవసభ చరిత్రలో నిలిచిపోవడం ఖాయం. కేసీఆర్ కు తెలంగాణకు పేగు బంధం ఉంది.చావునోట్లో తల పెట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన కోరకు కృషి చేసిన నాయకుడు కేసీఆర్. సారు కారు సర్కారు అనే నినాదంతో... ప్రజలు కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారు.కేసీఆర్ పాలనలో తెలంగాణరాష్ట్రం దేశానికే ఆదర్శం. ఈ కార్యక్రమాలలో బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ ఖందు రమేష్ రావ్,యువనాయకులు సర్కూర్ నీలేష్,సాగర్,భాస్కర్,మనోహర్,కార్యకర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బోధన్‌లో శ్రద్ధ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహణ

బోధన్ పట్టణం, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని రేణుక మాత ఫంక్షన్ హాల్లో శ్రద్ధ హైస్కూల్ 2010 2011 విద్యార్థుల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు సుబ్బారావు దంపతులు, ఉపాధ్యాయులు కైరాన్, రామారావు, శ్రీనివాస్, రామ కృష్ణ, సాయిలు, అనిల్, గజేందర్, పరమేశ్వర్, వెంకటకృష్ణ, నవీన్, కపిల్, సంతోష్, సునీల్, ఉమాకాంత్



తదితరులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు తమ విద్యా దశలో అటు ఉపాధ్యాయులతో, తమ స్నేహితులతో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను తలుచుకుని ఆనందపడ్డారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని కీర్తి, రాణి, స్నేహ, నగేష్, అశోక్ మిత్రబృందం సమిష్టిగా విజయవంతంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల కలయిక పాఠశాల పట్ల అభిమానం, ఉపాధ్యాయుల పట్ల కృతజ్ఞతను చాటిచెప్పింది. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. పాఠశాల నిర్వాహకులు సుబ్బారావు మాట్లాడుతూ తమ విద్యార్థులు నేడు సభ్య సమాజంలో ఉన్నతంగా నిలిచినందుకు, మమ్మల్ని గుర్తించి ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. శ్రద్ధ హైస్కూల్ విద్యార్థుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచిన విద్యార్థుల ఆత్మీయ బంధాలను మరింత బలోపేతం చేసిందనీ అన్నారు.



## వరంగల్ సభకు వెళ్తున్న బస్సులను అడ్డుకున్న గ్రామస్తులు

గుమ్మడిదల,ఏప్రిల్ 27,సమయం న్యూస్ : వరంగల్ లో నిర్వహిస్తున్న బి ఆర్ ఎస్ రజతోత్సవ సభకు వెళ్తున్న కార్యకర్తల బస్సులను సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. గ్రామ సమీపంలో నిర్మిస్తున్న డంప్ యార్డుకు వ్యతిరేకంగా గత 80 రోజులుగా మండల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తాము చేస్తున్న పోరాటాన్ని పట్టించుకోకుండా గ్రామ బిఆర్ఎస్ నాయకులు సభకు హాజరవుతుండటంపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. "పార్టీలకన్నా మాకు ప్రాణాలు ముఖ్యమని" "మా భవిష్యత్తును కాపాడాలని" వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని బస్సుల ఎదుట నిరసన తెలిపారు.

# నేటి నుంచి భక్త మార్కండేయ స్వామి ప్రతిష్ఠోత్సవాలు

* **మూడు రోజులపాటు ఉత్సవాలు..**
* **ఏర్పాటు పూర్తి చేసిన పద్మశాలి సంఘం సభ్యులు...**





రాయపోల్.ఎప్రిల్ 27. రాయపోల్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ భక్త మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఉత్సవాలు నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహి స్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామంలో పద్మశాలి సంఘం సభ్యులు నూతనంగా ఆలయం నిర్మించారు. ఆలయాన్ని రంగురంగులతో అలంకరించి. విద్యుత్ దీపాలతో ద్వేదీప్యమానంగా సర్వ సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేశారు. ఉత్సవాలు మొదటి రోజైనా సోమవారం ఉదయం గణపతి పూజ. పుణ్యవచనం .ఋత్వికరణం. మాతృక పూజ. దేవత ఆహ్వానం. అఖండ దీపారాధన. వాస్తు యోగిని. నవగ్రహ క్షేత్రపాలక. అంకురారోపణ. సర్వతో భద్ర. మంటప పూజ. అగ్ని ప్రతిష్ట. జులాదివాసం. అవహిత దేవత పూజ. మంగళ హారతి. మంత్రపుష్పం. తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే రోజు సాయంత్రం . ద్వారా తోరణ పూజ. నిత్య హోమం. మూల మంత్ర హోమం. పూర్ణాహుతి. శిరాధివాసం. బలిహరణ. ఆరగింపు. తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రెండో రోజు మంగళవారం ఉదయం గణపతి పూజ. అవహిత దేవతల పూజలు. హోమాలు. మూల మంత్ర హవనం. రుద్ర సుక్త. లక్ష్మి సుక్త. మాన్య సూక్త. హవనములు. ప్రసాద సంస్కారం. దాబ్యాధివాసం. శయ్యాది వసం. పుష్పాది వాసం. అవహేత పూజ. మంగళ హారతి. మంత్రపుష్పం. తీర్థ ప్రసాదం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్సవాలను చివరి రోజైన బుధవారం ఉదయం గణపతి పూజ. స్థాపిత దేవత పూజలు. మూలమంత్ర అవణములు. గర్త సంస్కారంలు.. 10 గంటలకు రోహిణ నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశమున యంత్ర ప్రతిష్ట. శ్రీ భక్త మార్కండేయ స్వామి మూర్తి ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ప్రతిష్ట తర్వాత భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ట మహోత్సవాల ఉత్సవాలకు పురోహితులు వెంకటేశ్వర శర్మ. త్రివేణి వేణుగోపాల శర్మ. పార్వతీ ఆంజనేయ శర్మ తదితర పురోహితులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాయపోల్ తో పాటు ఆ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్త మార్కండేయ స్వామి ప్రతిష్ట మహోత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ పద్మశాలి సంఘం పిలుపునిచ్చింది. ఇప్పటికే గ్రామంలో ఆలయం వద్ద కన్నుల పండుగ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మార్కండేయ స్వామి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# ముగిసిన అఖండ శివనామ సప్త









బోధన్ పట్టణం, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శ్రీ ఏక చక్రేశ్వర శివాలయంలో వీరశైవ సమాజ్ భజన మండలి ఆధ్వర్యంలో గత ఏడు రోజులుగా నిర్వహించబడుతున్న 20 వ అఖండ శివనామ సప్త ఆదివారం రోజుతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రవచకులుగా శ్రీ 108 షతస్థల బ్రహ్మ సిద్ధ దయాల్ శివాచార్య మహారాజ్, బెట్ మొగ్రా విచ్చేసి వీరశైవధర్మం గురించి తెలపడం జరిగింది. ఈ ఏడు రోజులు భక్తులు భక్తితో వీరశైవుల పవిత్ర పరమ రహస్య పారాయణ గ్రంథ పఠనం, భజనలు, సంకీర్తనలలో పాల్గొనడంతో ఆసాంతం ఎంతో ఆసక్తిగా సాగింది. అలాగే మాస శివరాత్రి సందర్భంగా సామూహిక ఇష్ట లింగ రుద్రాభిషేక పూజ, శివపార్వతుల కళ్యాణం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సమాజంలో వీరశైవ ధర్మానికి ప్రత్యేక స్థానం ఉందని, వీరశైవరు ప్రతిక్కురు మన ధర్మాన్ని పాటిస్తూ ఉండాలని అన్నారు. మానవత్వమే అన్ని ధర్మాల కంటే మహోన్నత ధర్మమని, జీవరాశులన్నింటిలో కంటే మానవ జన్మ చాలా విశిష్టమైనదని, నేటి దైనందిన జీవితంలో మానవులు ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో, భగవాన్ నామస్మరణతో, పుణ్య కార్యాలు నిర్వహించి, ఎలాంటి అసమానతలకు తావివ్వకుండా ప్రతి మానవుడు వీరశైవులు నిలవాలని అన్నారు. అలాగే భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాన్ని పాటించాలని తెలిపారు. కమిటీ సభ్యులు పలువురిని సన్మానించడం జరిగింది. అనంతరం పంచ పీఠాలకు, స్వామివారికి మంగళ నిరాజనాలు సమర్పించి స్వామివారి దివ్య ఆశీర్వచనాన్ని తీసుకోవడం జరిగింది భక్తుల కొరకు సప్త కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రముఖులు, సప్త కమిటీ సభ్యులు, మహిళా భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవంలో భాగంగా
## గంగమ్మ తల్లి ఒడి మహోత్సవం





బోధన్ పట్టణం, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో కురుమల ఆరాధ్య దైవం శ్రీ బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలు బోధన్ పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభం కాగా ఆదివారం రోజున గంగమ్మ తల్లి ఓడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘ పట్టణ అధ్యక్షుడు గోరెంచే వీరయ్య, ప్రధాన కార్యదర్శి కడికొల్ల శంకర్ మాట్లాడుతూ శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలలో కురుమ సంఘ సంప్రదాయం ప్రకారం భాజా భజంత్రీలతో, పోతరాజులతో ఊరేగింపుగా పాండు చెరువు చెరువు గంగమ్మ తల్లి కి ఓడి కి చేరుకొని అక్కడ తమ సాంప్రదాయ ప్రకారం విశేష పూజలు నిర్వహించారు. అలాగే గంగమ్మ ఒడిలో గల తమ ఆరాధ్య దైవులను తీసుకొని ఊరేగింపుగా తమ సంఘ భవనానికి చేరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కురుమ సంఘాల ప్రముఖులు పట్టణ ప్రముఖులు నాయకులు మహిళా భక్తులు తదితరులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

## సీపీ ఆదేశాలను ఉల్లంఘిస్తున్న హోటల్స్, బేకరీలు

* **బోధన్ పట్టణంలో అర్ధరాత్రి వరకు ఓపెన్**

బోధన్ పట్టణం, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : బోధన్ పట్టణంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పీ.సాయి చైతన్య ఇచ్చిన ఆదేశాలను నిర్లక్ష్యంగా విస్మరిస్తూ కొన్ని హోటల్స్, బేకారీలు, దాబాలు అర్ధరాత్రి వరకు తెరిచి ఉన్నాయి. సత్‌పుల్ వద్ద బేకరీ, వీక్లీ మార్కెట్ ప్రాంతం, వంద స్తంభాల గుడి వద్ద కొన్ని హోటల్స్ అధికారీ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నాయి. ప్రజలంతా విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో, రాత్రి 12 తర్వాత కూడా ఈ వ్యాపార సముదాయాలు తెరిచి ఉండటం వల్ల యువత అసాంఘిక కార్యకలాపాలకు లోనవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రజా శాంతి భద్రతలకు ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. బోధన్ లో అర్ధరాత్రి బేకరీ, హోటల్స్ తెరిచి ఉండటం, సీపీ ఆదేశాలు ఉల్లంఘన ఈ అంశం పై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.







## రజతోత్సవ సభకు బయలుదేరిన గులాబి దండు

జిన్నారం,ఏప్రిల్ 27, సమయం న్యూస్; సంగారెడ్డి జిల్లా జిన్నారం, గుమ్మడిదల మండలాలు,బొల్లారం, గడ్డపోతారం మున్సిపాలిటీల నుండి బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున వరంగల్ రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుండి బయలుదేరారు.బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రతీ గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొన్నారు. తెలంగాణ ఉద్యమం లో ఆసువులు బాసిన అమరవీరులను గుర్తు చేసుకొని నివాళులు అర్పించారు. బొల్లారం మున్సిపాలిటీ నుండి మాజీ జడ్పీటీసీ కోలాన్ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో,గుమ్మడిదల మున్సిపాలిటీ నుండి సిజెఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో, జిన్నారం నుండి బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు వెంకటేశం గౌడ్ ఆధ్వర్యంలో వందలాది వాహనాలలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,మాజీ కార్పొరేటర్లు, నాయకులు,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కదలి వెళ్లారు.





## బహిరంగ సభకు బయలుదేరిన అంబర్ పేట గులాబి దళం

అంబర్ పేట,ఏప్రిల్, 27 (సమయం న్యూస్): వరంగల్ జిల్ల ఎల్కతుర్తి క్రాస్ రోడ్ లో 25 సంవత్సరాల బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అంబర్పేట్ డివిజన్ నుంచి భారీగా ప్రజలు కార్యకర్తలు తరలి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అంబర్ పెట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ నాయకత్వంలో అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పటేల్ నగర్ చౌరస్తాలో పార్టీ నాయకులు కార్యకర్తల తో కలిసి బిఆర్ఎస్ పార్టీ జెండాని ఆవిష్కరించి దాదాపు 1500 మందితో సభకు తరలి వెళ్లడం జరిగింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి జాఫర్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకులు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పహెల్గాం ఉగ్రవాదులదాడిలో మృతి చెందిన అమరులకు నివాళి

జిన్నారం, ఏప్రిల్ 27, సమయం న్యూస్ : పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమాయక ప్రజల ఆత్మ శాంతికి, జిన్నారం మండలం ఖాజీపల్లి గ్రామంలో ఆర్.కే. ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ ర్యాలీని గ్రామంలోని ప్రధాన వీధులగుండ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతంలో అమాయక ప్రజల ప్రాణాలను ఉగ్రవాదులు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు భగవంతుడు ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నాడు. ఉగ్రవాదులను హతమార్చేవరకు వారి ఆత్మకు శాంతి కలగదని, కేంద్రం ఉగ్రమూకలను ఎరిపారేసే నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్. కే ఫౌండేషన్ సభ్యులు,యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వ్రితిక జన్మదినం సందర్భంగా సాయిబాబా పంచలోహ విగ్రహానికి 17000/ లు విరాళం!!

శివంపేట ఏప్రిల్ 27 (సిరి న్యూస్) : శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబదేవాలయం మరియు దత్తాత్రేయ దేవాలయా నిర్మాణంలో భాగంగా హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగొని శివకుమార్ గౌడ్ మనుమరాలుచిరంజీవి వ్రితిక డాక్టర్ సుధాకర్ రచితల ఏకైక కూతురు వ్రీతిక 12వ పుట్టినరోజు సందర్భంగా అమెరికా ఫ్లోరిడా నుండి శ్రీ గురు పీఠంలో స్థాపించబోయే శ్రీ షిరిడి సాయిబాబా పంచలోహ ఉత్సవ విగ్రహానికి 17వేల రూపాయలను విరాళంగా పంపించడం జరిగినది. శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరంజీవి వ్రితిక ఎంతో సంస్కారంగా మన తెలుగువారి నాట్య కళావైభవాన్ని అభ్యసిస్తూ ఉన్నతమైన విద్యా నైపుణ్యతను కనబరుస్తూ చదువులో ఉన్నత స్థాయిని కనబరుస్తున్నారు. చిరంజీవి వ్రితిక భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి ఆయురారోగ్యాలతో బంగారు భవిష్యత్తు ప్రసాదించాలని దత్త స్వరూపులు శ్రీ సాయినాధుని ప్రార్థిస్తున్నాం చిరంజీవి వ్రితికను శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ తరఫున అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాం అని అన్నారు.

# భూభారతితో నిర్దిష్ట గడువు లోపు భూ సమస్యల పరిష్కారం

- **దేశంలోనే మొట్టమొదటిసారిగా రైతులకు ఉచిత న్యాయ సహాయం**
- **అవగాహన సదస్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**






నిజామాబాద్ ఏప్రిల్ 27 :(సమయం న్యూస్) : నిర్దిష్ట గడువు లోపు రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి నూతన చట్టం ప్రవేశపెట్టిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఆదివారం నిజామాబాద్ నార్త్, సౌత్ మండలాల పరిధిలోని రైతులకు అర్సపల్లిలోని గ్రామ చావిడిలో ఏర్పాటు చేసిన సదస్సులో భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి చట్టం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని తెలిపారు. ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం ద్వారా రైతులు సెక్షన్ 4 లోని సబ్ సెక్షన్ లు 4, 5 ప్రకారం భూ రికార్డులను సవరణ చేసుకునే అవకాశం కల్పించారని సూచించారు. భూ విస్తీర్ణంలో మార్పులు, రికార్డులలో నమోదు కాని విస్తీర్ణాన్ని నమోదు చేయడం వంటి వాటిని తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలలో పరిశీలన జరిపి చేసేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా అధికారాలు కల్పించిందని తెలిపారు. ఫలితంగా రైతులు తమ భూముల రికార్డులకు సంబంధించిన పొరపాట్లను స్థానికంగానే సరి చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలంలోపు రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన రాష్ట్రంలోని నాలుగు మండలాలలో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారని, మే మొదటి వారంలో అన్ని జిల్లాలలో మొదటగా ఒక్కో మండలంలో దీనిని అమలు చేసి, క్షేత్రస్థాయిలో గమనించిన వివిధ అంశాలను బట్టి ప్రభుత్వం భూభారతి చట్టంలో అవసరమైన మార్పులు, చేర్పులు చేయనుందని వివరించారు. అనంతరం మే, జూన్ మాసాలలో అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు ఏర్పాటు చేసి, భూ సమస్యలపై రైతుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రైతులు భూభారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వాటిని పరిశీలించి క్షేత్రస్థాయిలో సర్వే, విచారణ జరిపిన తర్వాతే భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సమయంలో తప్పిదాలు చోటుచేసుకున్నాయని, తమకు సరైన న్యాయం జరగలేదని భావిస్తే, సంబంధిత రైతులు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించారని, ఈ మేరకు ప్రభుత్వం భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థను ప్రవేశ పెట్టిందని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి రైతు సంతృప్తి చెందకపోతే 60 రోజుల్లోపు ఆర్డీఓకు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. అక్కడ కూడా తగు న్యాయం జరగలేదని భావిస్తే 30 రోజుల్లోపు కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు. ఈ మేరకు రెవెన్యూ కోర్టులను ప్రభుత్వం ఈ నూతన చట్టం కింద పునరుద్ధరిస్తూ, వాటి ద్వారా నిర్ణీత కాల వ్యవధిలో భూ సమస్యల పరిష్కారానికి గడువును నిర్దేశించిందని సూచించారు. ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలలో రెవెన్యూ కోర్టులు వెలువరించే ఉత్తర్వులపై అభ్యంతరాలు ఉంటే ల్యాండ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించవచ్చని, సీసీఎల్ఏ కు రివిజన్ అధికారాలు సైతం కల్పించారని తెలిపారు. అప్పీలు చేసుకున్న పేద రైతులకు దేశంలోనే తొలిసారిగా ఉచిత న్యాయ సహాయం అందించేలా ఈ కొత్త చట్టం ద్వారా అవకాశం కల్పించారని అన్నారు. జిల్లా స్థాయిలో నియమించబడే న్యాయ సహాయ బృందం అప్పీలు చేసుకున్న పేద, చిన్న, సన్నకారు రైతులకు న్యాయ సలహాలు అందిస్తారని, అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం కూడా అందిస్తారని అన్నారు. ప్రతి గ్రామంలో నాలుగు రకాల రికార్డులను నిర్వహిస్తారని, ఏటా జరిగే భూమార్పుల రిజిస్టర్, చెరువులు, కుంటలు వంటి భూముల రిజిస్టర్, గ్రామ పహానీ, ప్రభుత్వ భూముల రిజిస్టర్ వంటి రికార్డులు నిర్వహిస్తారన్నారు. ఆధార్ తరహాలోనే భూకమతాల వారీగా భూదార్ సంఖ్య కేటాయిస్తారని, దీనివల్ల భూ వివాదాలకు ఆస్కారం ఉండదని, ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. అంతేకాకుండా భూముల హద్దులతో కూడిన (మ్యాప్) పటం పట్టా పాస్ బుక్కులలో జత పరుస్తారని తెలిపారు. సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం సమగ్ర రూపంలో తెచ్చిన భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సుల్లో ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాలరాజు, నాగార్జున, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్ర రాజకీయాల్లో వరంగల్ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతుంది

- **బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **తెలంగాణ సబ్బండవర్గాల ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని కేటీఆర్ పిలుపు**
- **పార్టీ నేతలతో కెటిఅర్ టెలికాన్ఫరెన్స్**

హైదరాబాద్, ఎప్రిల్ 27 (సమయం న్యూస్) : ఓరుగల్లు వేదికగా జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ సైనికులతో పాటు తెలంగాణ సబ్బండవర్గాల ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ ముఖ్య నేతలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఉదయాన్నే గులాబీ జెండాలు ఆవిష్కరించుకొని కదలిరావాలని సూచించారు. పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన సభ కాబట్టి సభకు హాజరయ్యే వారు గులాబీ రంగు దుస్తులు ధరించి రావాలని కోరారు. రాష్ట్ర నలుమూలల నుంచి సభకు తరలిరావాలనే ఉత్సాహం ప్రజల్లో పెద్ద ఎత్తున ఉందని, వారందరినీ సమన్వయం చేసుకొని అనుకున్న సమయానికి సభా ప్రాంగణానికి చేరుకునేలాగా ప్రణాళిక వేసుకోవాలని కోరారు. పార్టీ సిల్వర్ జూబ్లీ సభకు తరలివచ్చే ప్రతి వాహనానికి అన్ని వైపులా గులాబీ జెండాలను కట్టుకుని ఉత్సాహంగా బయలుదేరాలని కోరారు. ఎండల వల్ల ఇబ్బంది లేకుండా ప్రతి బస్సులో మంచినీళ్ల బాటిళ్ళు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు భోజన వసతికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. తెలంగాణ నలువైపుల నుంచి తరలివచ్చే వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా ఇప్పటికే రూట్ మ్యాప్ పంపించామని, దానికి అనుగుణంగానే ఆయా రూట్లలో సభ స్థలికి చేరుకోవాలని తెలిపారు. సభా ప్రాంగణానికి 30 కిలోమీటర్ల దూరం నుంచి రోడ్లపై ఎక్కడ వాహనాలు నిలపరాదని, నేరుగా వారికి సూచించిన పార్కింగ్ స్థలాలకు చేరుకొని మాత్రమే వాహనాలను నిలపాలని సూచించారు. అనేక ప్రాంతాల్లో పార్టీ వాలంటీర్లు ఎప్పటికప్పుడు గైడ్ చేసేందుకు సిద్ధంగా ఉంటారని వెల్లడించారు. సభకు చేరుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ మంచినీటి బాటిళ్లతోపాటు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు వాలంటీర్లు సిద్ధంగా ఉంటారని తెలిపారు. చారిత్రక సభలో కేసిఆర్ గారి ప్రసంగంపై అన్ని వర్గాల్లో పెద్ద ఎత్తున ఆసక్తి నెలకొని ఉందని, రాష్ట్ర రాజకీయాల్లో ఈ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## మత్తు పదార్థాల నియంత్రణలో శ్రమించిన అధికారులకు డీజీపీ చేతుల మీదుగా రివార్డులు



హన్మకొండ ఎప్రిల్ 27 (సమయం న్యూస్) : విస్తృత స్థాయిలో మత్తు పదార్థాలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులకు రాష్ట్ర డీజీపి చేతుల మీదుగా రివార్డులు అందుకున్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధ్వర్యంలో శనివారం రాత్రి హైదరాబాద్ డీజీపీ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమములో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యాంటీ నార్కోటిక్స్ అధ్వర్యంలో గంజాయి లాంటి మత్తు పదార్థాలను పట్టుకొవడం శ్రమించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఇన్స్పెక్టర్లు కరుణాకర్, సుధాకర్ రెడ్డి, సార్ల రాజు, శ్రీధర్ ను రాష్ట్ర డీజీపీ డా.జితేందర్ అభినందించి రివార్డులను అందజేసారు. ఈ నందర్భంగా రివార్డులను అందుకున్న అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

# మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

**ఎప్రిల్ 27( సమయం న్యూస్):**

- మావోయిస్టుల సమస్యను కేంద్ర ప్రభుత్వం శాంతి భద్రత సమస్య కాకుండా సామాజిక ఆర్థిక,రాజకీయ సమస్యగా చూడాలి.
- ప్రధాని మానవత్వంతో ఆలోచించి మావోయిస్టుల సమస్యకు పూర్తి పరిష్కారం చూపాలి
- మావోయిస్టులు కూడా ఆయుధాలు వదిలి ప్రజాస్వామ్యం లోకి వచ్చి పోరాడాలి
- ప్రధాని నరేంద్ర మోదీకి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞాప్తి
- కాల్పులు విరమిస్తే తాము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూల దృక్పథంతో ఆలోచించి వారినీ చర్చలకు పిలవాలని బీసీ సంక్షేమ సంఘం



జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రధాని నరేంద్ర మోడీకి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

- మావోయిష్టుల సమస్యను శాంతి భద్రతల సమస్య పరిగణించకుండా, సామాజిక ఆర్థిక, రాజకీయ సమస్యగా పరిగణించి సానుకూల వాతావరణం కల్పించి తమ బాధ్యతగా కేంద్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి మావోయిస్టులతో చర్చించి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని ఆయన కోరారు
- మావోయిస్టులు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా తాము ప్రభుత్వాలతో చర్చలకు సిద్ధమేనని అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తే ప్రభుత్వంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని వారు ప్రకటించడం చాలా మంచి పరిణామం అన్నారు, మావోయిస్టులు కూడా ఆయుధాలను వదిలిపెట్టి ప్రజాస్వామ్యంలోకి వచ్చి ప్రజాస్వామ్య బద్ధంగా, రాజ్యాంగానికి లోబడి, ప్రజా సమస్యలపై పోరాడాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ మావోయిస్టులకు సూచించారు
- మావోయిస్టులు కూడా భారతదేశ పౌరులైనని, సొంత బిడ్డలను చంపుకోవడం కేంద్ర ప్రభుత్వానికి తగదని ఇలాంటి సమయంలోనే ప్రధాని మోదీ విజ్ఞతతో ఆలోచించి నక్సల్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలని ఆయన కోరారు, పోలీసులు, మావోయిస్టులు ఒకరికొకరు శత్రువులు కారని ఇది అనేక సందర్భాలలో నిరూపితమైందన్నారు, మావోయిష్టుల చేతికి పోలీసులు దొరికిన, పోలీసుల చేతికి మావోయిస్టులు దొరికిన ఒకరికి ఒకరు చంపుకోలేదని ఇలాంటి సందర్భంలోనే మానవత్వం నిలబడతుందని ఆయన అన్నారు
- తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లు ఎలాంటి బేషాజా లకు వెళ్లకుండా చర్చలు ప్రారంభించాలని దండకారణంలో మరియు కర్రే గుట్టలలో సాగుతున్న భద్రతా దళాల ఆపరేషన్ ను నిలిపివేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.



జిల్లా అడ్మినిస్ట్రేషన్ , నార్నూర్ బ్లాక్ అస్పరేషనల్ ప్రోగ్రాం 2024 కు గాను ఢిల్లీ లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోది గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా ను ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జి కె.ప్రభాకర రావ్, అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి. శివరాం ప్రసాద్ శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో బొకె అందించి శాలువాతో సన్మానించారు.

## మే 01 నుండి పరిశీలనాత్మకంగా వీఐపీ బ్రేకు దర్శనాల్లో మార్పు

తిరుపతి ఏప్రిల్ 27 (సమయం న్యూస్) : వేసవి సెలవుల రద్దీ నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపి లకు మాత్రమే మే 01 నుండి జూలై 15 వరకు బ్రేక్ దర్శనాలు పరిమితం

**- టిటిడి కీలక నిర్ణయాలు**

శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం టిటిడి మే 01 తారీకు నుండి పలు కీలక నిర్ణయాలు అమలు చేయనుంది. వేసవి సెలవుల నేపథ్యంలో ఇప్పటికే తిరుమలకు భక్తుల రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించడంలో భాగంగా మే 01 తారీకు నుండి జూలై 15 వ తారీకు వరకు, వీఐపీ బ్రేక్ దర్శనాలు కేవలం స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే టీటీడీ పరిమితం చేయనుంది. అదేవిధంగా మే 01 తారీకు నుండి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపిలకు వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రయోగాత్మకంగా ఉదయం 6 గంటల నుండి అమలు చేయనుంది.

ప్రెషర్ కుక్కర్.. దీని సహాయంతో వివిధ వంటకాలను సులభంగా వండేయచ్చు. అయితే కొన్ని రకాల వంటకాలను ప్రెషర్ కుక్కర్‌లో వండడం వల్ల అవి రుచి కోల్పోవడమే కాకుండా.. పలు ఆరోగ్య సమస్యలూ వస్తాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందామా...







# ప్రెషర్ కుక్కర్‌లో.. ఇవి వండద్దట!

**ఇవి వద్దు!**

ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్లు వచ్చినా.. ఇప్పటికీ కొంతమంది ప్రెషర్ కుక్కర్‌లో అన్నం వండుతుంటారు. అయితే ఇది ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే బియ్యంలో స్టార్చ్ ఎక్కువగా ఉంటుంది. ప్రెషర్ కుక్కర్‌లో అన్నం వండినప్పుడు ఈ స్టార్చ్ హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుంది. దానివల్ల పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే ప్రెషర్ కుక్కర్‌కు బదులు సాధారణ గిన్నెలోనే అన్నం వండుకోవడం మేలంటున్నారు. అన్నంతో పాటు స్టార్చ్ ఎక్కువగా ఉన్న బంగాళాదుంపలు, పాస్తా, నూడుల్స్.. వంటివీ ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదట!

**పాలు-పెరుగు**

కొన్ని కూరల్లో గ్రేవీ కోసం పాలు, పెరుగు పోసి వండడం మనకు అలవాటే! అయితే ఇలాంటి వంటకాల్ని కూడా ప్రెషర్ కుక్కర్‌లో వండడం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే కుక్కర్‌లోని అధిక వేడి, ఒత్తిడికి పాలు విరిగిపోయే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. కూర రుచి కూడా దెబ్బతింటుంది. ఇలాంటివి తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం!

**త్వరగా ఉడికేవి!**


త్వరగా ఉడకని పప్పులు, మటన్.. వంటి పదార్థాల కోసమే ఎక్కువమంది ప్రెషర్ కుక్కర్‌ని వాడుతుంటారు. కానీ కొంతమంది ఆకుకూరలు, వంకాయ, బ్రకలీ, క్యాలీఫ్లవర్.. వంటి త్వరగా ఉడికే వాటికీ ప్రెషర్ కుక్కర్ వాడుతుంటారు. అయితే దీనివల్ల అందులో ఉత్పత్తయ్యే అధిక వేడి కారణంగా ఆయా కాయగూరలు, ఆకుకూరల్లోని పోషకాలు నశిస్తాయి. అలాగే అవి వాటి సాధారణ రంగు, రుచిని కూడా కోల్పోతాయి. కాబట్టి ఇదీ ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదు.

**బేకింగ్ కోసం..!**

అవెన్ లేని వారు కేక్స్, కుకీస్.. వంటి బేకింగ్ ఉత్పత్తులు తయారుచేయడానికి ప్రెషర్ కుక్కర్‌ని వాడుతుంటారు. దీనివల్ల అవి అంత మృదువుగా రాకపోగా.. వాటి టెక్స్చర్, రుచి దెబ్బతింటాయి.

# నిగనిగలాడే కురుల కోసం..!

నిగనిగలాడే నల్లటి వాలు కురులు అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. ఈ రోజుల్లో ఆహారపు అలవాట్లతో పాటు మారుతోన్న జీవనశైలి ప్రభావం కురులపై కూడా పడుతోంది. వీటికి తోడు స్టైలింగ్ కోసం ఉపయోగించే ఉత్పత్తులు కేశాలను నిర్జీవంగా మార్చేస్తున్నాయి. దీనికి పరిష్కారంగా ఇంట్లోనే సులభంగా చేసుకునే హెయిర్‌ప్యాక్‌ను ప్రయత్నించి చూడండి.





**కావాల్సినవి:**

* కోడిగుడ్డు సొన
* తేనె- ఒక చెంచా
* ఆలివ్ ఆయిల్ - ఒక చెంచా
* ఆముదం నూనె - ఒక చెంచా
* ఆర్గన్ ఆయిల్- ఒక చెంచా

**తయారీ:**

* ముందు కోడిగుడ్డు సొన ఒక పాత్రలో వేసుకుని బాగా కలపాలి. తర్వాత తేనె, ఆలివ్ ఆయిల్, ఆముదం నూనె, ఆర్గన్ ఆయిల్ కూడా వేసి బాగా కలపాలి.
* ఈ మిశ్రమాన్ని తలకి పట్టించి అరగంట పాటు ఆరనివ్వాలి. తర్వాత మంచి షాంపూ, కండిషనర్‌తో జుట్టుని శుభ్రపరుచుకుంటే సరి.. నిగనిగలాడే కురులు సొంతమవుతాయి.

# ముడతలూ, మచ్చలూ అందుకేనా?



**30వ పడిలోకి అడుగుపెట్టగానే... వృద్ధాప్య ఛాయలు మొదలైపోయాయని బాధపడేవారే ఎక్కువ. ఈ సమస్య నుంచి బయటపడటానికి ఏవేవో మార్గాల్ని అనుసరిస్తుంటారు. వాటిలో మాయిశ్చరైజర్ల వాడకం ఒకటి. అయితే, సరైన వాటిని ఎంపిక చేసుకోకపోయినా, రాసుకునే విధానం తెలియకపోయినా... సమస్య మరింత జటిలం అవుతుంది. అసలు దీన్నెలా వాడాలంటే...**

* చాలామంది పొడిబారిన చర్మంపై మాయిశ్చరైజర్ రాస్తుంటారు. అలాకాకుండా చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడు మాత్రమే దీన్ని రాయాలి. అప్పుడే ప్రభావవంతంగా పనిచేస్తుంది.
* ఇప్పుడంతా ఉరుకులూ, పరుగులే... ఆ కంగారులో దీన్ని రాసుకుని, వెంటనే మేకప్ వేసుకునే వాళ్లే ఎక్కువ. దీనివల్ల చర్మకణాలు మూసుకుపోయి, వృద్ధాప్య ఛాయలు తొందరగా వచ్చేస్తాయట. అందుకే దీన్ని రాసుకున్నాక 1015 నిమిషాలైనా ఆరనివ్వాలి. అప్పుడే అనుకున్న స్థాయిలో ఫలితం ఉంటుంది.
* చాలా మాయిశ్చరైజర్స్‌లో చర్మానికి హాని చేసే రసాయనాలు ఉంటాయి. అందుకే వీటి ఎంపికలో సహజసిద్ధమైన వాటితో తయారైన వాటికి ప్రాధాన్యత ఇవ్వండి. ఒకవేళ వేరే ఉత్పత్తులు వాడినా... తయారీలో వాడే వస్తువులు, స్థాయిలూ మీ చర్మతత్వానికి సరిపోతాయో లేదో తెలుసుకుని... వైద్యుల సలహా మేరకు తీసుకుంటేనే మేలు.
* చర్మ సంరక్షణలో ముఖానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి... మెడను అలానే వదిలేస్తారు. దాంతో పిగ్మెంటేషన్, ముడతలు పడి... ఎక్కువ వయసు వారిలా కనిపిస్తారు. కాబట్టి ముఖంతోపాటూ మెడకూ దీన్ని రాయాలి.
* వీటి వాడుకలో పరిమాణమూ ముఖ్యమే. ఏ చర్మతత్వానికి ఎంతమేర మాయిశ్చరైజర్ వాడొచ్చో తెలుసుకోవాలి. అలాకాకుండా, ఎక్కువ,తక్కువ రాస్తే అనుకున్న స్థాయిలో ఫలితాలు ఉండవు.
* ఆయిలీ స్కిన్ కాబట్టి మాయిశ్చరైజర్స్ అవసరం లేదనుకుంటారు చాలామంది. కానీ దీనికీ ఇవి అవసరమే.
* చర్మం మీద ఉండే మృతకణాల్ని ఎప్పటికప్పుడూ తొలగిస్తూ ఉండాలి. ఇలా చేయకుండా మాయిశ్చరైజర్ రాసినా ఉపయోగం ఉండదు.

## మాల్దీవుల్లో...
# సేదతీరుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్..!



సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు సేదతీరేందుకు మాల్దీవులకు వెళ్లారు. ఈ విషయాన్ని ఆ జట్టు యాజమాన్యం అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో వెల్లడించింది. 25వ తేదీన చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. ఆ తర్వాత జట్టుకు 2వ తేదీ వరకు మరో మ్యాచ్‌లేదు. దీంతో ఆటగాళ్లు, వారి కుటుంబ సభ్యులు, సహాయ సిబ్బంది రిఫ్రెష్‌అయ్యే విధంగా యాజమాన్యం వారిని మాల్దీవుల ట్రిప్‌కు తీసుకెళ్లింది. దీనికి సంబంధించిన వీడియోను కూడా పోస్టు చేసింది. ''మాల్దీవుల్లో మా రైజర్స్ కోసం సూర్యుడు, సముద్రం, ఓ టీమ్ రిట్రీట్'' అని క్యాప్షన్‌ను జత చేసింది. ఆటగాళ్లు, సిబ్బంది అక్కడకు చేరుకోగానే ఘన స్వాగతం లభించింది. ఇషాంత్ కిషన్ అక్కడి ప్రకృతి అందాలను చిత్రీకరిస్తున్న దృశ్యాలు కూడా ఉన్నాయి. ఐపీఎల్ లీగ్ దశ కూడా పూర్తికాకుండానే సన్‌రైజర్స్ జట్టు దేశం దాటి విహారయాత్రకు వెళ్లడంపై కొందరు పెదవి విరుస్తున్నారు. జట్టు ఇప్పటి వరకు కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది. దీంతో ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే రానున్న ప్రతి మ్యాచ్‌లో విజయం సాధించాల్సి ఉంది. ఒక్క ఓటమి కూడా వారి అవకాశాలను దెబ్బతీయగలదు.

## లఖ్‌నవూను బెంబేలెత్తించిన బుమ్రా..
# ముంబయి వరుసగా ఐదో విజయం



ముంబయి: ఐపీఎల్ 18 సీజన్‌లో తొలుత తడబడ్డ ముంబయి ఇండియన్స్ ఇప్పుడు వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హార్దిక్ సేనకు వరుసగా ఇది ఐదో గెలుపు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో లఖ్‌నవూ సరిగ్గా 20 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (34; 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (27; 15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఆయుష్ బదోని (35; 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (24; 16 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడినా భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఐడెన్ మార్‌క్రమ్ (9), రిషభ్ పంత్ (4), అబ్దుల్ సమద్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ముంబయి బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (4/22) లఖ్‌నవూ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో మార్‌క్రమ్‌ను ఔట్ చేసి లఖ్‌నవూకు గట్టి షాక్ ఇచ్చిన బుమ్రా.. 16 ఓవర్‌లో మిల్లర్, సమద్, అవేశ్ ఖాన్ (0)ని పెవిలియన్‌కు పంపాడు. ట్రెంట్ బౌల్ట్ (3/20) కూడా అదరగొట్టాడు. విల్ జాక్స్ 2, కోర్బిన్ బాష్ ఒక వికెట్ పడగొట్టారు. లఖ్‌నవూకు 10 మ్యాచ్‌ల్లో ఇది ఐదో ఓటమి.



# చెక్ చేసుకుని.. రీస్టార్ట్ చేయాలి..

### : బాలీవుడ్ పరిస్థితిపై నాని వ్యాఖ్యలు

నాని హీరోగా శైలేశ్ కొలను దర్శకత్వం వహించిన చిత్రం 'హిట్ 3'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన బాలీవుడ్ ప్రస్తుత పరిస్థితి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రతి పరిశ్రమలో ఏదో ఒక సమయంలో ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎదురవుతాయని చెప్పారు. బాలీవుడ్ తిరిగి నిలదొక్కుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ''బాలీవుడ్ అనే కాదు.. పరిశ్రమ ఏదైనా ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎదురుకావడం సహజం. ప్రస్తుతం దక్షిణాది చిత్రాలు అంతటా రాణిస్తున్న మాట వాస్తవమే అయినప్పటికీ.. టాలీవుడ్ కూడా ఇలాంటి రోజులను చూసింది. కొన్ని నెలల పాటు సినిమాలు ఆశించిన ఫలితాలను అందించలేదు. సినిమాలు ఆడక మేము థియేటర్లు మూసి వేసిన సందర్భాల్లూ ఉన్నాయి. అలా, అని కుంగిపోలేదు. మరింత ఉత్సహం, పట్టుదలతో చిత్రాలు రూపొందించి ప్రేక్షకులకు అందించాం. హిందీలోనూ అదే పరిస్థితి రానుందని భావిస్తున్నా. ఇప్పుడున్న రోజుల్లో భాషతో సంబంధం లేకుండా మంచి చిత్రాలను వీక్షించాలని ప్రతి ఒక్కరూ అనుకుంటున్నారు. గొప్ప చిత్రాలను తెరకెక్కించాలనే ఆశతో ఫిల్మ్ మేకర్స్ వర్క్ చేస్తున్నారు. బాలీవుడ్ ఒకానొక సమయంలో ఎన్నో అద్భుతమైన చిత్రాలు తెరకెక్కించింది. చిన్నతనంలో ఆయా చిత్రాలను మేమంతా వీక్షించాం. కాబట్టి, ఆ పరిశ్రమ మళ్లీ నిలదొక్కుకుంటుంది. ఇలాంటి గడ్డు కాలం ఎదురైనప్పుడు.. ఒక్కసారి ఆగి మనల్ని మనం చెక్ చేసుకుని రీస్టార్ట్ చేయాల్సి ఉంటుంది'' అని నాని చెప్పారు.

# సినిమా

## శ్రీవారిని దర్శించుకున్న నాని



**తిరుమల:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారిని న్యాచురల్ స్టార్ నాని దర్శించుకున్నారు. హిట్ 3 మూవీ హీరోయిన్ శ్రీనిధి శెట్టితో కలిసి ఇవాళ ఉదయం సుప్రభాత సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో నానికి వేద పండితులు వేదశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ప్రతి సినిమా విడుదలకు ముందు శ్రీవారిని దర్శించుకోవడం ఓ ఆనవాయితీగా వస్తుందని అన్నారు.



# సమంత @ మాత

## 'శుభం'లో సామ్ స్పెషల్ అప్పియరెన్స్

రెండేండ్లుగా సిల్వర్ స్క్రీన్ కు దూరమైపోయిన సమంతా ఎట్టకేలకు వెండితెర మీద కనిపించబోతోంది. ఆమె ప్రొడక్షన్ లో నిర్మాణమైన మొదటి సినిమా శుభం మే 9 విడుదల కానుంది. ట్రాలాలా బ్యానర్ పై ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతుంది. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి.. పలువురు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విలేజ్‌బ్యాక్‌డ్రాప్‌లో దాదాపు అందరూ కొత్తగా వాళ్లతో వస్తోన్న ఈ హారర్ కామెడీ ఎంటర్ టైనర్ లో వెరైటీ పాయింట్ తీసుకున్నారు. తాజాగా శుభం సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో శుభం కథ ఏంటో సింపుల్‌గా చెప్పే ప్రయత్నం చేసింది చిత్ర బృందం. ఊర్లోని మహిళలంతా రాత్రి 9 గంటలకు ప్రసారం అయ్యే సీరియల్‌కు అడిక్ట్ అవుతారు.. ఆ సీరియల్ చూస్తూ దెయ్యాల్లా మారిపోతారు. ఇక ఇంట్లో మగాళ్లకి రక్షణ కరువు అవుతుంది. ఆ తరువాత ఓ మాతగా సమంత కనిపిస్తుంది. మరి ఈ మాత ఏం చేస్తుంది? అసలు మహిళలంతా అలా ఎందుకు వింతగా ప్రవర్తిస్తారు? అన్న పాయింట్లే సినిమాలో చూపించబోతోన్నారని అర్థం అవుతోంది. మరోవైపు ఈమూవీలో సామ్ స్పెషల్ అప్పియరెన్స్ అదిరిపోయేలా ఉంది. అయితే ట్రైలర్‌లో మాత్రం డైలాగ్స్ లేకుండా సైగలతోనే ఆకట్టుకుంది.




# అందులో తప్పు లేదు



'కెరటం' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి టాప్ హీరోయిన్‌గా ఎదిగిన బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌సినిమాతో తెలుగు అభిమానుల మనసు దోచుకుంది. లేటెస్టుగా 'మేరే హస్బెండ్ కీ బీవీ'లో కనిపించింది. ప్రస్తుతం ఈముద్దుగుమ్మ 'ఇండియన్ 3'తో పాటు బాలీవుడ్‌లో 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నది. ఓ వైపు మూవీస్, మరోవైపు బిజినెస్‌వ్యవహారాలు చూసుకుంటూ చాలా బిజీగా గడుపుతోంది ఈ చిన్నది. కాగా.. సినీ ఇండస్ట్రీలోకి వచ్చి 15 ఏండ్లు గడుస్తున్నా తన అందచందాలతో ఫ్యాన్స్‌ను అలరిస్తూ ఉంది. రకుల్ ఇటీవల కాస్మోటిక్ సర్జరీపై తన అభిప్రాయాలను వెల్లడించింది. 'నాకు దేవుడు అందమైన ముఖాన్ని ఇచ్చాడు.. కాబట్టి నేను అలాంటి వాటి గురించి ఆలోచించలేదు. గతంలో చాలావ్యాధులకు చికిత్స లేదు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. ఎవరైనా అందంగా కనిపించడానికి కాస్మోటిక్ సర్జరీ చేయించుకోవాలనుకుంటే అందులో తప్పు లేదు' అని పేర్కొంది.



ఇన్‌స్టాగ్రామ్‌లో క్యాజువల్ బ్లాక్ స్టైల్‌లో ఆనందాన్ని పంచిన దీపికా పిల్లి



చంద్రుడిలా మెరిసిపోతూ, ప్రతి దుస్తులను మీనాక్షి సొంతం చేసుకుంటుంది కొన్నిసార్లు, ఆమె సాదా చీర వంటి సరళమైనదాన్ని ఎంచుకోవడం ద్వారా అందరినీ ఆశ్చర్యపరుస్తుంది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.